తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
13-05-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 99
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575



## కన్నులపండువగా కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు

**కొండగట్టు సిరి న్యూస్:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం లక్ష పూలు, పండ్లతో మూల విరాట్టును ప్రత్యేకంగా అలంకరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

హనుమాన్ దీక్షా స్వాములు స్వామివారి సన్నిధిలో మాల విరమణ చేసి ఇరుముడులను సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ అర్ధరాత్రి తర్వాత ఆలయానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. భక్తులకు సాఫీగా దర్శనం కల్పించేలా సిబ్బందికి పలు సూచనలు చేస్తూ క్యూ లైన్లను క్రమబద్ధీకరించారు.





## మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ

- కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించం
- రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగొద్దు
- క్షేత్రస్థాయిలో కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్:**

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ధాన్యం సేకరణ పురోగతిపై

మిగతా 4వ పేజీలో..



## సభ్యత్వ నమోదు, ఇన్‌చార్జిల నియామకాలపై దృష్టి

- పార్టీ పునర్వ్యవస్థీకరణ, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చ
- ప్రభుత్వ వైఫల్యాలపై పోరుకు కార్యాచరణ
- ఎర్రవెల్లిలో కేసీఆర్ వ్యూహాత్మక సమావేశం

2

# మిల్లర్ మాఫియాకు రైతన్న బలి!

ట్రాన్స్పోర్ట్ గుప్పిట్లో అన్నదాత రెక్కల కష్టం

రాష్ట్ర వ్యాప్తంగా లారీల సమస్య

కృత్రిమ కొరతతో తరుగు దోపిడీ

జిల్లాకో క్లస్టర్ విధానం.. ఇది కాంట్రాక్టర్ల మాయాజాలం

ధాన్యం కొను 'గోల్'మాల్.. బస్తాకు 4 కిలోల తరుగు

మిల్లర్లకు వేల టన్నుల మిగులు

కోట్ల రూపాయల రైతు శ్రమ దోపిడీ చేస్తున్న ట్రాన్స్పోర్ట్ సిండికేట్ దోపిడీపై అధికారుల మౌనం !

ముఖ్యమంత్రి ఆదేశించిన మారని తీరు!

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్:**

తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగులుపై జరుగుతున్న దోపిడీ అంతా ఇంతా కాదు. యాసంగి పంట కొనుగోలు కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికి సగం ధాన్యం కూడా కొనుగోలు కాలేదు. తెలంగాణ మొత్తం యాసంగి వరి ఉత్పత్తి 200 లక్షల టన్నులు ఉంటుందని అధికారిక అంచనా. అందుకోసం ఏప్రిల్ మొదటి వారంలోనే కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసారు. 600 పైచిలుకు మండలాల్లో ఐకెపి ,వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా ధాన్యం



మిగతా 2వ పేజీలో..

# పరారీలో బండి భగీరథ్..?!

- 3 రోజులుగా ఫోన్ స్విచ్ ఆఫ్
- పోక్సో కేసు నమోదైన తర్వాత కనిపించకుండా మాయం
- అందుబాటులోకి రాకపోవడంతో సిట్ గాలింపు ముమ్మరం
- ఫోన్ స్విచ్ ఆఫ్‌తో మరింత మిస్టరీగా మారిన వ్యవహారం
- సన్నిహితులు, ఫ్రెండ్స్, కాల్ డేటాపై పోలీసుల ఫోకస్
- అరెస్ట్ తప్పదనే భయంతో అజ్ఞాతంలోకి వెళ్లారా?
- తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన కేసు
- నిజాలు బయటపెట్టాలంటూ ప్రతిపక్షాల డిమాండ్
- సోషల్ మీడియాలో భారీ చర్చ..
- ఉత్కంఠగా తదుపరి పరిణామాలు

2






## బేటా భగావో.. బేటా బచావో!

- బండి భగీరథ్ మిస్సింగ్ పై కేటీఆర్ ట్వీట్
- సోషల్ మీడియాలో ట్రెండింగ్
- వెంటనే అరెస్ట్ చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

2

## హైకోర్టును ఆశ్రయించిన భగీరథ్

- 14న విచారించనున్న వెకేషన్ బెంచ్

**హైదరాబాద్, సిరి న్యూస్:**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన పోక్సో కేసులో మధ్యంతర

మిగతా 2వ పేజీలో..




## కేంద్ర వైఫల్యంతోనే నీట్ లీకేజీ రద్దు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- లక్షలాది మంది విద్యార్థుల ఆశలు గల్లంతు

**సిరి న్యూస్, తెలంగాణ బ్యూరో :**

నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, దేశవ్యాప్తంగా పరీక్ష రద్దు చేయడం వెనుక కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి

మిగతా 2వ పేజీలో..





## 2న ఆదిలాబాద్‌లో 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు

- క్యూర్ పరిధిలో 5 నుంచి 8 కి.మీ పరిధిలోనే..
- నియోజకవర్గం యూనిట్‌గా స్థలాల గుర్తింపు
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుపై స్పెషల్ డ్రైవ్
- ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి

4

## చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది

- పొన్నం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం: పీసీసీ చీఫ్ మహేశ్

**హైదరాబాద్, మే 12సిరిన్యూస్:**

మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో

మిగతా 3వ పేజీలో..





## కన్న పేగును క్షోభ పెడుతున్నారు

- నా కుటుంబానికి నిప్పంటించారు
- ఆ నిప్పు వాళ్లనే దహించి వేయబోతోంది
- తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు
- తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే
- కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం
- కరీంనగర్ హిందూ ఏక్తా యాత్రలో కేంద్ర మంత్రి బండి

2

# కేంద్ర వైఫల్యంతోనే నీట్ లీకేజీ, రద్దు

మొదటిపేజీ తరువాయి

కనిపిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో ఆశలతో ఎంట్రన్స్ టెస్ట్ రాయగా.. కొందరు చేసిన పనికి వారంతా ప్రభావితులవుతున్నారని వాపోయారు. దేశ వ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీ అత్యంత ఆందోళనకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని నీట్ పరీక్ష రాశారని చెప్పారు. అలాంటి కీలక పరీక్షలో అవకతవకలు చోటుచేసుకోవడం విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందని మంత్రి పేర్కొన్నారు.

**విద్యావ్యవస్థ పరువు దిగజారిపోయింది..**

కేంద్రంలో, రాజస్థాన్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని మంత్రి దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని దద్దమ్మ ప్రభుత్వం కేంద్రంలో ఉండటం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు దేశ విద్యావ్యవస్థ పరువును దిగజార్చాయని, ఈ పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. ఈ సంక్షోభానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# పరారీలో బండి భగీరథ్..?!

తెలంగాణ క్రైం బ్యూరో సిరి న్యూస్



బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు రోజురోజుకు కొత్త మలుపులు తిరుగుతోంది. కేసు నమోదు అయినప్పటి నుంచి రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న ఈ వ్యవహారం.. ఇప్పుడు భగీరథ్ అందుబాటులో లేకపోవడంతో మరింత సంచలనంగా మారింది. గత మూడు రోజులుగా ఆయన మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటం, ఎక్కడ ఉన్నారన్నది స్పష్టత లేకపోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీస్తోంది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్ ) ఈ కేసును అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే భగీరథ్‌కు సంబంధించిన కాల్ డేటా, మొబైల్ లొకేషన్, సన్నిహితుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా ఆయన ఎవరెవరితో మాట్లాడారు? కేసు బయటకు వచ్చిన తర్వాత ఎవరిని సంప్రదించారు? ప్రస్తుతం ఎక్కడ దాక్కున్నారన్న కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. భగీరథ్ మొబైల్ మూడు రోజులుగా స్విచ్ ఆఫ్‌లో ఉండటం పోలీసులను కూడా అప్రమత్తం చేసినట్లు సమాచారం. సాధారణంగా కీలక కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు అందుబాటులో లేకపోతే.. అది దర్యాప్తులో కీలక అంశంగా మారుతుంది. దీంతో సిట్ బృందం ఆయన కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. మరోవైపు అరెస్ట్ భయంతోనే భగీరథ్ అజ్ఞాతంలోకి వెళ్లారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇంకొందరు మాత్రం న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నారని, ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అయితే ఈ విషయాలపై అధికారికంగా ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. ఈ కేసు రాజకీయ రంగు పులుముకోవడంతో అన్ని పార్టీల దృష్టి ఇప్పుడు సిట్ దర్యాప్తుపైనే నిలిచింది.

**కేసును నీరు గార్చొద్దంటున్న ప్రతిపక్షాలు**

ప్రతిపక్ష పార్టీల నేతలు మాత్రం 'బాధితురాలికి న్యాయం చేయాలి', 'కేసును నీరుగార్చొద్దు' అంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుండగా.. మరోవైపు బీజేపీ నేతలు మాత్రం రాజకీయ కక్ష సాధింపే జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా సోషల్ మీడియాలో కూడా ఈ కేసుపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. 'ఎందుకు ఫోన్ స్విచ్ ఆఫ్?', 'ఎక్కడున్నారు భగీరథ్?', 'పోలీసులు అరెస్ట్ చేస్తారా?' అంటూ నెటిజన్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. కొందరు వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తుండగా.. మరికొందరు దర్యాప్తు పూర్తయ్యే వరకు వేచి చూడాలని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కేసు దర్యాప్తు బాధ్యతలను కఠిన అధికారిణిగా పేరుగాంచిన డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని సిట్ కి అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో కేసు మరిన్ని కీలక మలుపులు తిరిగే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ, పోలీసు వర్గాల్లో జోరుగా సాగుతోంది.

**బండి భగీరథ్ కేసులో కొత్త ట్విస్ట్**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన ఆధారాలను తొలగించే ప్రయత్నంలో భాగంగా బాధితురాలి ఫోన్‌ను హ్యాక్ చేయాలని ప్రయత్నించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన 20 ఏళ్ల యువ ప్రైవేట్ ఎతికల్ హ్యాకర్‌ను సంప్రదించిన నిందితుడు, మైనర్ బాధితురాలి మొబైల్ ఫోన్‌లోని డేటాను డిలీట్ చేయాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే ఇది పెద్ద కేసుగా మారే అవకాశం ఉందని, తాను కూడా పోక్సో కేసులో ఇరుక్కుపోయే ప్రమాదం ఉందని భావించిన ఆ యువ హ్యాకర్ ఇందుకు నిరాకరించినట్లు సమాచారం.

**హై కోర్టులో బెయిల్ పిటిషన్**

బండి భగీరథ్ పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ తెలంగాణ హై కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు వేసవి సెలవులు కావడంతో వెకెసిన్ బెంచును ఆశ్రయించారు. ఈ మేరకు ఈ నెల 14 వ తేదీన విచారణకు రానున్నట్టు సమాచారం. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ బుధవారం పెట్ బషీరాబాద్ స్టేషనులో విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసులు జారీచేశారు. ఇదే సమయంలో అయన హై కోర్ట్ లో మధ్యంతర బెయిలుకు ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# హైకోర్టును ఆశ్రయించిన భగీరథ్

మొదటిపేజీ తరువాయి

బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. 'సిట్' ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసే అవకాశం ఉంది. మరోవైపు భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్టు చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.



# మిల్లర్ మాఫియాకు రైతన్న బలి!

మొదటిపేజీ తరువాయి

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసారు . నెల రోజులు గడుస్తున్నా నేటికీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముందుకుసాగడంలేదు.ఇందుకు ప్రధాన కారణం ట్రాన్స్పోర్ట్ నిర్వాహకులు మిల్లర్ల మధ్య రైతులను ఎలా దోచుకోవాలో అన్న అవగాహనే కారణమన్నది అర్థమవుతోంది.

**మొదట్లో హమాలీ బూచీ..**

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మొదట్లో హమాలీల కొరత ఉందని కొనుగోలు కేంద్రాల నిర్వహకులు పేర్కొన్నారు. ఏటా వచ్చే బీహార్ కూలీల రాక ఆలస్యం కావడంతో అప్పట్లో లారీల ప్రస్తావనే రాలేదు.ఐతే ఆ సమస్య వారం రోజుల్లో సర్దుబాటు కావడం ఆపై కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దింతో లారీల సమస్య మొదలైంది. ఏప్రిల్ మొదటివారంలో కొంత డీజీల్ కొరత మూలంగా లారీలు రావడంలేదని సంబంధిత కాంట్రాక్టర్లు అధికారులకు తెలిపారు. ఆలా కొనుగోలు జరిగినా కేంద్రాలలోనే వేలాది క్వింటాళ్ల ధాన్యం ఉండిపోయింది.

**అసలు కథ ఇలా మొదలైంది..**

ధాన్యం సేకరణ సమయంలో రైతుకు కోసింది మొదలు మిల్లుకు చేరేవరకు ముళ్లబాటే. వేసంగి కావడంతో కొనుగోళ్లు కేంద్రాలలో సీరియల్ వచ్చే వరకే ధాన్యం బాగా ఎండి తరుగుపోతుంది. ఆపై తూకం వేసాక జాప్యం జరిగితే మరింత నష్టం జరుగుతుంది. దింతో ఎలాగైనా ధాన్యం మిల్లుకు చేరి రసీదు పొందాలని రైతు కోరుకుంటాడు .

**రైతుల సమస్యను దోపిడీగా మార్చుకొని కృత్రిమ కొరత**

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఏడువేల పైచిలుకు మిల్లులకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి పంపేందుకు కేవలం 200 క్లస్టర్లు ఉన్నాయ్. ఆయా క్లస్టర్లలో లారీలను ఏర్పాటు చేసేందుకు టెండర్లను పిలుస్తారు. టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లే ధాన్యం మిల్లర్లకు చేరుస్తారు. ఇప్పుడు అదే కాంట్రాక్టర్లు మిల్లర్లు కలిసి పన్నిన కుట్ర మూలంగానే కొనుగోలు జాప్యం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు.

**రైతును ఇబ్బంది పెట్టి.. భారీగా తరుగు తీసి..**

కొనుగోలు కేంద్రాల వద్దనుండి లారీ వెళ్ళాక సదరు మిల్లర్ ఆ ధాన్యాన్ని దించుకోవాలి. కానీ ధాన్యం బాగాలేదని ఎక్కువ తేమ ఉందని చెబుతూ ఒక మూడు రోజుల పాటు లారీ ని అన్లోడ్ చేయరు.దింతో తరుగు ఇంకా పెరిగే అవకాశం ఉందని విసుకు చెందిన రైతు మిల్లరును సంప్రదిస్తే ఇక అప్పుడు తరుగు ఇంత ఇస్తేనే అన్లోడ్ లోడ్ చేసుకుంటామని సదరు మిల్లర్ చెబుతాడు. చేసేది ఏమిలేక రైతు ఒప్పుకుంటాడు .ఇలా క్వింటల్కు. 10 కిలోల వరకు తరుగు తీస్తూ ఒక్కో జిల్లాలో మిల్లర్ ట్రాన్స్పోర్ట్ మాఫియా కలగలిసి చేస్తున్న దోపిడీ కోట్ల రూపాయల్లో ఉంటుందని అంచనా

**ఒక్కో జిల్లాకు ఒక్కో విధానం**

రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసే క్లస్టర్ విధానం రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లాకు ఒక్కో విదంగా ఉండటం కూడా ఒక కారణమవుతోంది . తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 600 పైచిలుకు మండలాలకు గాను కేవలం 200 క్లస్టర్లు ఏర్పాటు చేసారు.సగటున 2 లేదా మూడు మండలాలు క్లస్టర్ ఏర్పాటు చేయవచ్చు కానీ కొన్ని జిల్లాల్లో 8 మండలాలకు కలిపి ఒక క్లస్టర్ ఏర్పాటు చేయడం కూడా సదరు కాంట్రాక్టర్లకు ఇలా దోపిడీ చేసే అవకాశాన్నిచ్చింది. ఐతే ఎప్పుడో ఏర్పాటు చేసిన ఈ క్లస్టర్లు పెంచాల్సి ఉన్న సదరు కాంట్రాక్టు మాఫియా మూలంగా అదే విధానం కొనసాగుతుందన్నది ఒక వాదన .ఉదాహరణకు మెదక్ జిల్లాలో 18 మండలాలు ఉండగా 2 క్లస్టర్లు ఉన్నాయ్.ఇదే జిల్లాలో దాదాపు 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది.దింతో కేంద్రాలనుండి ధాన్యం సేకరణ కష్టమవుతుందని కాంట్రాక్టర్ కుంటి సాకులు చెప్పే అవకాశం దొరికింది.

**అధికారుల మౌనం..**

కొనుగోలు కేంద్రాలు మొదలు మిల్లు వరకు తరుగు దోపిడీ జరుగుతున్నా అధికారులు మాత్రం మౌనం ప్రదర్శిస్తున్నారు. అసలు పౌర సరఫరా శాఖ ఉందా అన్న చందంగా వారు వ్యవహరిస్తున్నారు. ఐతే ఇందుకు కారణం ఈ మాఫియా ఆ శాఖను సంతృప్తి పరచడమే నన్నది మరొక వాదన .

**లారీ నింపాలంటే మూడువేల ఇవ్వాల్సిందే..**

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనుండి మిల్లర్ల వద్దకు వెళ్లే లారీ లోడ్ కావాలంటే మూడువేలు ఇవ్వాల్సిందే అని లారీ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారట ఇది కూడా సదరు మాఫియా కనుసన్నల్లో జరుగుతుందన్నది జగమెరిగిన సత్యం.ఆలా ఇవ్వకుంటే సీరియల్ ఉన్నా ఆ ధాన్యాన్ని లారీలో ఎక్కించరు. ఒకవేళ ఎవరైనా పిర్యాదు చేస్తే అధికారులు నిర్వాహకులతో చెప్పి సదరు పిర్యాదుదారుణ్ని శాంతింప జేస్తారు. కానీ డబ్బులు ఇవాళ్లసిందేనని లేదంటే ధాన్యం వెళ్ళదని వాళ్లే చెప్పి సమస్యను ఆలా ముగిస్తారు. మామూలుగా రైతు ధాన్యం అమ్ముడు పోవాలన్న తొందరలో ఉండటం మూలంగా చివరకు వాళ్ల మాట విని డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది.

**ప్రతి పక్షాల నిరసన..**

ధాన్యం కొనుగోలు వాస్తవ పరిస్థితిపై ప్రతిపక్షాలు నెలరోజులుగా నిరసన తెలుపుతూనే ఉన్నాయ్. కల్లాలపై ఉంచిన ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ నిరసనలు చేస్తున్నారు. కొన్ని చోట్ల కొనుగోలు ఆలస్యంపై రైతులు రోడ్డెక్కుతున్నారు. మరికొన్ని చోట్ల ధాన్యం కుప్పలను తగలబెట్టారు. ఐనా అధికారులు ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చూడలేకపోతున్నారు. ఇందుకు కారణం a మాఫియా గుప్పిట్లోనే మొత్తం వ్యవస్థ ఉండటమన్నది జగమెరిగిన సత్యం.

**సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చినా..**

గత నెలరోజులుగా జరుగుతున్న ధాన్యం సేకరణపై సోమవారం ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్షా నిర్వహించారు. ఇందులో కొనుగోలు జాప్యం జరగకుండా ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. ఐనా క్షేత్ర స్థాయిలో పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు రైతు ను పిండి డబ్బులు దండుకునే ట్రాన్స్పోర్ట్ మిల్లర్ మాఫియా వెనక ఎన్ని అదృశ్య శక్తులు ఉన్నాయో. ఏది ఏమైనా ధాన్యం సేకరణ ఇప్పటికి సగం కూడా పూర్తవకపోవడంపై రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు.ఇకనైనా క్షేత్ర స్థాయిలోకి వెళ్లి అధికారులు సమస్య పరిష్కరించాలని రైతులు కోరుకుంటున్నారు.

# కన్న పేగును క్షోభ పెడుతున్నారు

- నా కుటుంబానికి నిప్పంటించారు
- ఆ నిప్పు వాళ్లనే దహించి వేయబోతోంది
- తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు
- తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే
- కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం
- కరీంనగర్ హిందూ ఏక్తా యాత్రలో కేంద్ర మంత్రి బండి

కరీంనగర్, మే 12 సిరి న్యూస్:



'ఏ తప్పూ చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు.. నిజానిజాలు కోర్టులు తేలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే.. చట్టం ముందు అందరూ సమానమే.. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం.. చట్టానికి కట్టుబడి ఉన్నా' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సమాజమే తన కుటుంబమని భావించి జీవితమంతా సమాజం కోసమే పనిచేసిన.. ఏ ఇంట్లో కష్టమొచ్చినా పెద్ద కొడుకునై అండగా ఉన్నా.. కానీ కొడుకుకు టైమివ్వలేకపోయా.. జరుగుతున్న పరిణామాలకు తప్పు నాదే. క్షమించండి అని సమాజానికి విజ్ఞప్తి చేశారు. త□న బాటలోనే నడిచిన తన భార్య కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా చేతనైనంత సాయం చేసిందని, ఈరోజు ఆ కన్న పేగునే క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను భయపడేది లేదంటూ 'నన్ను కెలికారు.. నా కుటుంబానికి నిప్పంటించారు.. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహించి వేస్తా.. అవినీతి గడీలను బద్దలు కొడతా అని అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంత్రి సంజయ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కరీంనగర్‌లోని వైశ్య భవన్ నుండి 'హిందూ ఏక్తా యాత్ర ప్రారంభమైంది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ఏక్తా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలాదిమంది ఈ యాత్రకు తరలివచ్చారు. కాషాయ శ్రేణులతో కరీంనగర్ జన సంద్రమైంది. ఈ సందర్భంగా బండి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'ఈ లైట్ల ఫోకస్‌కు కళ్లల్లో నీళ్లు వస్తే ఏడుస్తున్నానని అనుకునేరు.. నేను భయపడ.. సంజయ్ కంట తడి పెట్టే రకం కాదు.. టవర్ సర్కిల్‌పై కాషాయ జెండాను ఎగరేశాం.. హిందువుల ఐక్యతను చాటేందుకే 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర చేస్తున్నా.. జై శ్రీరాం అనే నినాదమే హిందూ ధర్మాన్ని కాపాడుతుంది.. హిందూ సమాజానికి ఆపదొస్తే జై శ్రీరాం నినాదంతో తెగించి కొట్లాడతాం.. కరీంనగర్ గడ్డ రక్తం నాలో ప్రవహిస్తున్నది.. గల్లీగల్లీలో ప్రజా సమస్యలపై కొట్లాడిన.. బాధలను చూసి భయపడి పారిపోయేటోడ్ని కాను.. మీరే నా కుటుంబం. సమాజమే నా ఇల్లు అనుకున్న.. హార్ట్‌లో స్టంట్ ఉన్నా హార్ట్‌ఫుల్‌గా 1600 కి.మీలు నడిచిన.. రాష్ట్ర ప్రజల కష్టాలను పంచుకున్న.. నాటి పాలకులు నాపై రాళ్ల దాడి చేసినా, 109 కేసులు పెట్టి జైలుకు పంపినా భయపడలే.. మీ ఇంట్లో పెద్ద కొడుకునైన.. నా టైమంతా సమాజానికే ఇచ్చిన.. నా కొడుకుకు టైమియ్యలేకపోయిన.. కొడుకుకు టైమివ్వకుండా నేను తప్పు చేసిన.. క్షమించండి.. నా కొడుకును క్రిమినల్‌గా చూపే ప్రయత్నం చేస్తున్నారు.. నన్ను, నా కుటుంబాన్ని, నా కార్యకర్తలను ఇబ్బంది పెట్టినోడిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు' అని బండి సంజj□YT అన్నారు. నా కొడుకు సంఘటన మమ్మల్ని ఇబ్బందిపెడుతుంటే 29మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా ఆ కుటుంబాలు పడుతున్న క్షోభ గుర్తుకొస్తోంది అని అన్నారు. శ్రీరామచంద్రుడికే కష్టాలు తప్పలేదు.. ఆయనే నాకు ఆదర్శం.. కష్టాలు భరిస్తా.. ఆనాడు రాక్షసులు ఆంజనేయస్వామికి నిప్పంటిస్తే ఏమైంది.. లంక దహనమైంది అని చెప్పారు.

# బేటా భగావో.. బేటా బచావో!

తెలంగాణ బ్యూరో సిరి న్యూస్

కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు అదృశ్యంపై బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన ట్వీట్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. పోక్సో కేసు నమోదై 4 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు నిందితున్ని అరెస్ట్ చేయక పోవడంపై అయన మండిపడ్డారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ బిజెపి నినాదమైన 'భేటీ పడావో భేటీ బచావో' నినాదాన్ని 'బేటా బగావో' నినాదంగా మార్చారని అయన మండిపడ్డారు. బండి భగీరథ్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని అయన ఆరోపించారు. కేంద్ర మంత్రి పరారవ్వడం ఇదే మొదటిసారా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో మహిళా రక్షణకు షీ టీమ్స్ ఏర్పాటు చేసారని అయన అన్నారు. కేవలం మంత్రి కొడుకు కావడంతోనే ప్రభుత్వం పరోక్షంగా కాలయాపన చేస్తుందని ఆయన ఆరోపించారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ బండి భగీరథ్ ను అరెస్టు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని అయన అన్నారు.

# సభ్యత్వ నమోదు, ఇన్‌చార్జిల నియామకాలపై దృష్టి

- పార్టీ పునర్వ్యవస్థీకరణ, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చ
- కీలక నేతల సమీకరణతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం
- ప్రభుత్వ వైఫల్యాలపై పోరుకు కార్యాచరణ
- ఎర్రవెల్లిలో కేసీఆర్ వ్యూహాత్మక సమావేశం

సిద్దిపేట, మే 12 సిరి న్యూస్:



రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి పెంచే దిశగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో మంగళవారం కీలక సమావేశం నిర్వహించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై చర్చించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీకి చెందిన కీలక నేతలు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీ నిర్మాణాన్ని గ్రామస్థాయి నుంచి మళ్లీ పటిష్టం చేయాలనే దిశగా కేసీఆర్ దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టడం, ప్రతి నియోజకవర్గానికి ఇన్‌చార్జిలను నియమించడం ద్వారా పార్టీ కేడర్‌ను మళ్లీ యాక్టివ్ చేయాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై దూకుడు పెంచే అవకాశం**

రైతు సమస్యలు, ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే అంశాలను ప్రజల్లో బలంగా తీసుకెళ్లే వ్యూహంపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా రైతు సమస్యలపై బీఆర్ఎస్ నేతలు దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు ఉద్యమాలపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**కేసీఆర్ మళ్లీ యాక్టివ్ రాజకీయాల్లోకి..**

కొంతకాలంగా ప్రజల్లో ప్రత్యక్ష కార్యక్రమాలను తగ్గించిన కేసీఆర్ ఇప్పుడు పార్టీ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఎర్రవెల్లి సమావేశం ద్వారా పార్టీకి స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడంతోపాటు, భవిష్యత్తు రాజకీయ పోరాటాలకు కేసీఆర్ సిద్ధమవుతున్నారనే సంకేతాలు కనిపిస్తున్నాయని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇంకా ఈ సమావేశంలో అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు తన్నీరు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్, వి.గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోష్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్.శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, టి.జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ స్పీకర్ కె.ఆర్.సురేష్ రెడ్డి, మాజీ మంత్రి మహమూద్ అలీ, మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.

**డిజిటల్ పద్ధతిలో సభ్యత్వ నమోదు**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' ప్రక్రియతోపాటు, ఓటరు లిస్టు సవరణ తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్ ప్రక్రియలో జరుగుతున్నందున పార్టీ సభ్యత్వం కూడా డిజిటలైజేషన్ పద్ధతిలో జరపాలని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదరర్శుల సమావేశం అభిప్రాయపడింది. అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం ఈ సమావేశం ఆరు గంటలపాటు సుదీర్ఘంగా జరగగా పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి నియోజకవర్గానికి రాష్ట్ర కమిటీ నుండి సభ్యత్వ సమన్వయకర్తను నియమించాలని, ప్రతీ మండ□ం, మున్సిపల్ బాడీల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం సజావుగా నిర్వహించడానికి సభ్యత్వ సమన్వయ కమిటీలను రెండుమూడు రోజుల్లొ నియమించాలని నిర్ణయించారు. డిజిటల్ పద్దతిలో సభ్యత్వ నమోదు చేయాలని భావించినందున రాష్ట్రంలో ఉన్న 35,655 పోలింగ్ బూత్‌లలో బూత్‌కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించాలని, ఈ సందర్భంగా డిజిటల్ మెంబర్‌షిప్ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలపై శిక్షణ ఇవ్వాలని సమావేశం అభిప్రాయపడింది.

# సంపాదకీయం



## పసిడి వ్యామోహం వద్దు.. దేశ ఆర్థికమే ముద్దు

భారతీయులకు బంగారం కేవలం ఒక ఆభరణం మాత్రమే కాదు, అది ఒక సెంటిమెంట్, ఆపదలో ఆదుకునే ఆర్థిక భరోసా. అయితే మారుతున్న అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, పెరుగుతున్న ముడిచమురు ధరల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన తాజా విజ్ఞప్తి ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. "ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు ఆపండి" అని ఆయన చేసిన పిలుపు వెనుక ఉన్న ఆర్థిక వాస్తవాలను లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో, ముఖ్యంగా ఇరాన్–అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటడం భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశానికి పెను సవాలు. ఒకవైపు చమురు కోసం మనం విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అదే సమయంలో భారతీయుల పసిడి వ్యామోహం వల్ల వేల కోట్ల డాలర్లు దేశం దాటి పోతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో సుమారు 72 బిలియన్ డాలర్ల విలువైన బంగారం దిగుమతి చేసుకోవడం మన వాణిజ్య లోటును ప్రమాదకర స్థాయికి తీసుకెళ్లింది.

### ఎందుకు వాయిదా వేయాలి?

ప్రధాని మోదీ ఈ విజ్ఞప్తి చేయడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం 'రూపాయి' విలువను కాపాడటం. మనం ఎంత ఎక్కువగా బంగారం కొంటే, అంత ఎక్కువగా డాలర్లను విదేశాలకు చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి బలహీనపడుతుంది. పెళ్లిళ్లు, శుభకార్యాల పేరుతో మనం చేసే అనవసర కొనుగోళ్లు దేశ ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నాయి. ప్రధాని కోరినట్లుగా ఏడాది పాటు ఈ కొనుగోళ్లను వాయిదా వేయగలిగితే, ఆ నిధులను దేశీయ మౌలిక సదుపాయాల కల్పనకు లేదా ఇతర ఉత్పాదక రంగాలకు మళ్లించే అవకాశం ఉంటుంది. అయితే ఈ పిలుపు పట్ల జ్యువెలరీ రంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. కోట్లాది మంది కళాకారులు, కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధాని ప్రకటన వెలువడగానే స్టాక్ మార్కెట్‌లో ప్రముఖ జ్యువెలరీ కంపెనీల షేర్లు కుప్పకూలడం దీని తీవ్రతకు అద్దం పడుతోంది. డిమాండ్ అకస్మాత్తుగా పడిపోతే ఈ రంగంలోని ఉపాధికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రభుత్వం కేవలం విజ్ఞప్తితో సరిపెట్టకుండా, ఈ రంగంలోని కార్మికులకు ప్రత్యామ్నాయ భరోసా ఇవ్వాల్సిన బాధ్యత కూడా ఉంది. దేశం ఒక అసాధారణ ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పుడు పౌరులుగా బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం. విదేశీ పర్యటనలు, పసిడి కొనుగోళ్లు వంటి వ్యక్తిగత సరదాల కంటే దేశ ఆర్థిక సుస్థిరత ముఖ్యం. ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడి పిలుపుగా కాకుండా, దేశ హితం కోసం చేసే త్యాగంగా భావించాలి. విలాసాల కంటే విలువలకే పెద్దపీట వేసి, దేశ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించడంలో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తోంది

- విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి
- టీజీసీహెచ్ఈ చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి



**వరంగల్, (సిరి న్యూస్):** ప్రపంచ దేశాలు నేడు భారతదేశం వైపు ఆశాజనకంగా చూస్తున్నాయని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి అన్నారు. కాకతీయ విశ్వ విద్యాలయం ప్లేస్మెంట్ సెల్ కార్యాలయం, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం కామర్స్ కళాశాల సెమినార్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల రెండో రోజు మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ప్లేస్మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆచార్య బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల సిలబస్లో సమగ్ర మార్పులు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి కోర్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్పై అవగాహన కల్పించేలా సిలబస్ రూపకల్పన జరుగుతోందన్నారు. డిగ్రీతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కూడా సమానంగా అవసరమని, నేటి విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ వైస్చాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు ప్రత్యేక నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. 2047 నాటికి వికసిత్ భారత్, రైజింగ్ తెలంగాణ లక్ష్యాల సాధనలో విశ్వవిద్యాలయ విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్లేస్మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు విడతల్లో నిర్వహించిన ప్రాంగణ నియామకాల ద్వారా 1,300 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో 12 ప్రముఖ సంస్థలు పాల్గొనగా, సుమారు 350 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, అందులో 110 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల మానవ వనరుల విభాగాల ప్రతినిధులను, ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ సంతోష్, కామర్స్ కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ప్రగతి, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్లేస్మెంట్ ఆఫీసర్లు రాకేష్, నందీశ్వర్, అరుణ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వాహనం క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- అర్ధరాత్రి అంతర్ జిల్లా చెక్పోస్టు తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ



**తాండూర్, (సిరి న్యూస్):** ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ అన్నారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు, శాంతిభద్రతలను కాపాడేందుకు మంచిర్యాల జోన్ తాండూర్ మండలం రేపల్లెవాడ వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్పోస్టు సోమవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. ప్రతి వాహన వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని ఆదేశించారు. అక్రమ పశువుల రవాణాపై పటిష్ట నిఘా ఉందని, నిబంధనలకు విరుద్ధంగా జరిగే రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, అనుమానాస్పద రవాణా కనిపిస్తే స్థానిక పోలీసులకు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. ఆయన వెంట తాండూర్ సీఐ దేవయ్య, బెల్లంపల్లి వన్టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రావు, తాండూర్ ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



**తాండూర్, (సిరి న్యూస్):** వేసవి ఎండలు మండిపోతుంటే, మరోవైపు తాండూర్ మేదరి వాడలో తాగునీరు సరిగా రాకపోవడంతో గొంతు ఎండిపోతోందని తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేదరివాడ మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం రోడ్డెక్కారు. గత నెల రోజులుగా వాటర్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా సరిగా లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. మేదరివాడలో గత నెల రోజులుగా నీటి ఎద్దడి ఉన్నా వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా సరిగా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ దివాకర్ ఘటన స్థలానికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్న ఆయన, నీటి సరఫరా పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో ఈ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో మహిళలు నిరసనను విరమించారు. రెండు రోజుల్లో తాగు నీటి సమస్య పరిష్కారం కాకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ రాస్తారోకోలో మేదరివాడ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల ఆత్మీయతకు నిదర్శనం

- నిరుపేద కుటుంబానికి అండగా మెడిగూడ గ్రామ పెద్దలు



**ఇచ్చోడ, (సిరి న్యూస్):** రక్త సంబంధీకులే ముఖం చాటేస్తున్న ఈరోజుల్లో ఆదివాసీలు మాత్రం "మేమున్నాం" అంటూ తోటివారికి అండగా నిలిచి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఆదివాసీ సంస్కృతిలో భాగమైన ఆప్యాయత, పరస్పర సహకారానికి మెడిగూడ గ్రామస్థులు మరోసారి నిదర్శనంగా నిలిచారు. మెడిగూడ గ్రామానికి చెందిన దివంగత కుంరం గంగారాం–సుమిత్రబాయి దంపతుల కుమార్తె కుంరం సునీత వివాహ సందర్భంగా ఆ కుటుంబానికి అండగా నిలవాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుంరం కోటేశ్ సారథ్యంలో గ్రామ పెద్దలు కలిసి రూ.23,500 నగదును పెళ్లి కానుకగా అందజేశారు. "ప్రేమను పంచే సంస్కృతి, ఆప్యాయతలే మా ఆస్తులు" అనే భావనతో గ్రామంలో జరిగే ప్రతి శుభకార్యాన్ని తమ ఇంటి వేడుకగా భావించడం ఆదివాసీ సంస్కృతికి నిదర్శనమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఆర్థిక సహాయం కంటే మిన్నగా "నువ్వు ఒంటరివి కాదు.. నీ వెనుక గూడెం ఉంది" అనే భరోసాను ఈ సహాయం ద్వారా తెలియజేశారని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. కష్టసుఖాలను సమానంగా పంచుకునే ఆదివాసీ జీవన విధానంలోని గొప్పతనం ఈ ఘటనలో ప్రతిఫలించిందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయాలు, పరస్పర ప్రేమాభిమానాలను కాపాడుకోవడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ఉదారతను చూసి గ్రామస్తులతో పాటు ఇతరులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కుటుంబ సర్వేను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

**నేరడిగొండ,(సిరి న్యూస్):** మండలంలోని నేరడిగొండ, వడ్డూర్ గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను రాష్ట్రస్థాయి పరిశీలకులు మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర పరిశీలకులు రాజేష్ కానన్, సౌరబ్ కుశ్వాహ, కృష్ణయ్యలు క్షేత్రస్థాయిలో సర్వే తీరును పర్యవేక్షించారు. గ్రామాల్లో ఎన్యుమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను, కుటుంబాల నుంచి సేకరిస్తున్న సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే ఫారాల్లోని అంశాలను ఎలా నమోదు చేస్తున్నారు, ప్రజల నుంచి వస్తున్న స్పందన ఎలా ఉందనే విషయాలపై స్థానిక అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా, పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు తమ సామాజిక, ఆర్థిక వివరాలను నిష్పక్షపాతంగా అందించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ ఎంఏ కలీమ్ పాల్గొన్నారు. సర్వే పురోగతిని, మండలంలో ఇప్పటివరకు పూర్తయిన వివరాలను ఆయన పరిశీలకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఎన్యుమరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ నిర్వహణ




**కౌటాల, (సిరి న్యూస్):** మండల కేంద్రంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష–2026 కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రోత్సాహంతో, కౌటాల మండల ఎంఈఓ నానాజీ, చింతల మానేపల్లి ఎంఈఓ జయరాజ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ కోచింగ్లో నిపుణులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎంఈఓ జయరాజ్, ఎన్.శ్రీనివాస్, వెంకటేశ్వర, కుర్మదాస్, తేజ, కె.శ్రీనివాస్, రామయ్య ట్యూటర్లుగా సేవలందించారు. మొత్తం 30 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు డోంగ్రే సురేష్ మాట్లాడుతూ అనుకోడ గ్రామానికి చెందిన జాడే చంద్రశేఖర్ బాలాజీ పేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదువుకొని ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి చేరాలనే ఆశయంతో "జన భవిత చారిటబుల్ ట్రస్ట్"ను స్థాపించినట్లు పేర్కొన్నారు. విద్య–ఆరోగ్యం ఆర్థిక సాధికారత"లక్ష్యంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా ధ్యాన కేంద్రాలు, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, నవోదయ, రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్షల కోచింగ్, ప్రభుత్వ పాఠశాలల్లో మోటివేషనల్ క్లాసులు, మెడికల్ క్యాంపులు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పాలీసెట్ ఉచిత కోచింగ్ సెంటర్ను నిర్వహించినట్లు వివరించారు. కౌటాల, చింతల మానేపల్లి, సిర్పూర్ మండలాలకు చెందిన విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని ఈనెల 13న జరిగే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. భవిష్యత్లో డైట్, టెట్ కోచింగ్తో పాటు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు, మోటివేషనల్ క్లాసులు నిర్వహించనున్నట్లు వివరించారు.

# 2న ఆదిలాబాద్‌లో 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్, మే 12 సిరి న్యూస్:

పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి తమ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని, అలాంటి తప్పు పునరావృతం కాకుండా పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కి.మీ పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లT నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు.

**ఆ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్**

2బిహెచ్‌కె ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరుకల్లా లబ్ధిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు 5 నుంచి 8 కి.మీ లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తయిన ఇండ్లలో లబ్ధిదారులు ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. పీడీలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెఎనఎన్‌యుఆరఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే, హౌసింగ్ కాలనీలన్నిటినీ సందర్శించాలని స్పష్టంగా నిర్దేశించారు.

**అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదు**

అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్‌సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశ్రమలు, ఐటి శాఖలు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ముఖ్యమైనదన్నారు. ఇది పకడ్బందీగా అమలవుతున్నదని, ఈ పథకాన్ని ఇదేవిధంగా ముందుకు తీసుకెళ్లాలని, పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పేదరికమే అర్హతగా లబ్దిదారుల ఎంపిక చేపడుతున్నామని, ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని స్పష్టం చేశారు. తాము ఎలాంటి భేషజాలకు పోవడం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కలెక్టర్లు ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ శాసనసభలో తీసుకున్న నిర్ణయం మేరకు సమావేశాలు నిర్వహించడం పట్ల మంత్రికి అభినందనలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా గొప్పగా అమలు అవుతున్నదని, జిల్లాస్థాయిలో కలెక్టర్లు ప్రతివారం ఈ పథకాన్ని సమీక్షించి పేదలకు మేలు కలిగేలా చూడాలని అన్నారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలి

- **మహిళల సాధికారతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు**
- **మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

హైదరాబాద్, మే 12 సిరి న్యూస్:



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి 31 వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళల సాధికారతకు అమలు చేస్తున్న పథకాలు, జీవనోపాధి కార్యక్రమాలు, ఆర్థిక స్వావలంబన చర్యలు ప్రజలకు స్పష్టంగా తెలియజేసేలా కార్యక్రమాలు ఉండాలని సూచించారు. కనీసం నాలుగు వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళా సంఘ సభ్యుల విజయగాథలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి అవకాశాలు, మహిళల నాయకత్వ వికాసం, సామాజిక మార్పు వంటి అంశాలను ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కాగా, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, వ్యవసాయ, అనుబంధ, వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాల కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. మహిళలను ఉద్యోగార్థులుగా కాక వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 63 లక్షలకుపైగా మహిళలు స్వయం సహాయక సంఘాల్లో భాగస్వాములై ఉన్నారని, దేశంలోనే అతి పెద్ద మహిళా ఆధారిత అభివృద్ధి వ్యవస్థగా తెలంగాణ నిలుస్తోందని పేర్కొన్నారు. అయిదేళ్లలో రూ.లక్ష కోట్ల క్రెడిట్ లింకేజ్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత రెండేళ్లలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజ్ సాధించడం ద్వారా మహిళల ఆర్థిక భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందన్నారు. వ్యక్తిగత మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వడ్డీ లేని రుణాల పథకం ద్వారా పేద కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం లభిస్తోందని మంత్రి తెలిపారు. బీఆరఎస్ హయంలో నిలిచిపోయిన వడ్డీ లేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 4.38 లక్షల సంఘాలకు రూ.1400 కోట్లు విడుదల చేసి దాదాపు 48 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు.

# జీవో ఇచ్చినా రేట్లు పెంచే ప్రసక్తే లేదు'

తెలంగాణ బ్యూరో

తెలంగాణ ఎగ్జిబిటర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇండస్ట్రీ బాగుండాలంటే పర్సంటేజీ విధానంలో సింగిల్ స్క్రీన్లు రన్ చేయడం తప్పనిసరి అని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సింగిల్ స్క్రీన్ల మనుగడకు టాలీవుడ్ స్టార్ హీరోలు, నిర్మాతల మద్దతు కావాలని కోరింది. ఈ విషయంలో ఎగ్జిబిటర్స్ అంతా ఓ నిర్ణయానికి వచ్చామని తెలిపింది. నిర్మాతలందరు అర్థం చేసుకుని మాకు సపోర్ట్ చేయాలని కోరారు. సింగిల్ స్క్రీన్స్‌పై సవతి ప్రేమ వద్దని అన్నారు. దిల్ రాజు సోదరుడు శిరీష్ మాట్లాడుతూ..'ఎగ్జిబిటర్స్ బ్రతుకు పోరాటం ఈ పర్సంటేజ్ విధానం. నిర్మాతలందరు అర్థం చేసుకొండి. మాకు సపోర్ట్ చేయండి. తెలుగులో సింగిల్ స్క్రీన్స్ అంతరించిపోతున్నాయి. ఇప్పుడంతా ఓటీటీలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. థియేటర్‌ను పక్కన పెట్టేస్తున్నారు. సింగిల్ స్క్రీన్‌ను కాపాడుకోవాల్సిన అవసరముంది. గవర్నమెంటు జీవో ఇచ్చినా సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో టికెట్ రేట్లు పెంచం' అని అన్నారు. ఎగ్జిబిటర్ శ్రీధర్ మాట్లాడుతూ..'2008 నుంచి పర్సంటేజ్ కోసం కొట్లాడుతున్నాం. హరిహర వీరమల్లు టైంలో మాట్లాడితే థియేటర్స్ మూసేస్తున్నామని నెగిటివ్ ప్రచారం చేశారు. నిదానంగా అన్నీ ప్రొడక్షన్స్ హౌస్‌లు పర్సంటేజ్ పద్ధతి వైపే వస్తున్నాయి. అందరూ ఈ విధానానికి వస్తే మేము థియేటర్స్ నడుపుతాం'అని అన్నారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ..'నిర్మాతకు ఎగ్జిబిటర్ బిడ్డతో సమానం. చాలా కాలం నుంచి సింగిల్ స్క్రీన్స్ పరిస్థితి దారుణంగా ఉంది. సింగిల్ స్క్రీన్స్ బిర్యానీ అయితే మల్టీప్లెక్స్ ఆవకాయ లాంటిది.

# మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ

మొదటిపేజీ తరువాయి





సమీక్షించారు. వివిధ జిల్లాల్లో తలెత్తుతున్న సమస్యలపై కలెక్టర్ల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూడడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు సరిపడా లారీలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ కమిషనర్‌ను ఆదేశించారు.ప్రాంతాల వారీగా సమస్య తీవ్రతను గుర్తించి కలెక్టర్లు తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు.గోదాముల సమస్య ఉన్న ప్రాంతాల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని, రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను వినియోగించి ధాన్యం నిల్వ చేయాలని సూచించారు. అక్కడి నుంచి గోదాములకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల్లో కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. అవసరమైన చోట పోలీసు సహాయం తీసుకుని ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలని సూచించారు.

**అకాల వర్షా ల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ**

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా శాశ్వత పరిష్కార దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు.

ప్రతి ఐకేపీ కేంద్రానికి ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి రైస్‌మిల్లు వద్ద బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానిక హమాలీలతో పని చేయించాలని సూచించారు.

ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం తెలిపారు. అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలను అరికట్టవచ్చన్నారు. లారీల కొరతను అధిగమించేందుకు ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**పంట కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని తెలిపారు.

**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: తుమ్మల నాగేశ్వరరావు**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు తెలంగాణ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావడంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

# చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది

మొదటిపేజీ తరువాయి

మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. కుల సంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. ఆయన సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పారు. పోక్సో చట్ట ప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ.. ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# రైల్ రోకో కేసులో కవితకు సమన్లు

- **నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం**
- **బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన కవిత**
- **కవితతో పాటు 12 మందిపైనా కేసులు**

తెలంగాణ బ్యూరో సిరి న్యూస్:

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే చట్టం కింద కేసులు నమోదు చేశారు రైల్ రోకో కేసులో కోర్టుకు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. నేడు ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నారు. గతేడాది నవంబర్ 28న కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో చేపట్టారు. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించి పంపిన బీసీ బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు. ఆ సమయంలో కవితతో పాటు రైల్ రోకో చేస్తున్న టీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కవితతో పాటు టీఆర్ఎస్ నాయకులు చేపట్టిన రైల్ రోకో కారణంగా సిర్నపల్లి - ఇందల్వాయి రైల్వే స్టేషన్ల మధ్య నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేశారు. అలాగే హైదరాబాద్ నుంచి నిజామాబాద్ రూట్ లో ప్రయాణిస్తున్న మరో గూడ్స్ రైలును నిలిపివేశారు రైల్ రోకో చేపట్టిన కవితతో పాటు మరో 12 మంది నాయకులపై కామారెడ్డి రైల్వే ఏఎస్ఐ రవీంద్ర బాబు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కవితతో పాటు 12 మంది టీఆర్ఎస్ నాయకులపై యు/Sec.147&74(ఏ) రైల్వే చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సికింద్రాబాద్ రైల్వేస్ సెకండ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసెస్ కోర్టు జారీ చేసిన సమన్లలో పేర్కొన్నారు

# జైలు మ్యూజియం ఏర్పాటు చరిత్రాత్మక ఘట్టం

హైదరాబాద్, మే 12 సిరి న్యూస్:

తెలంగాణ జైలు మ్యూజియం స్థాపన రాష్ట్ర కారాగార పరిపాలన చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. హైదరాబాద్ చంచల్‌గూడలో జైలు మ్యూజియం, ప్రత్యేకమైన ఫీల్ ది జైల్ ఎక్స్‌పీరియన్స్/జైలు అనుభవం కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఒకప్పుడు దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా జైళ్లు ప్రధానంగా శిక్షా కేంద్రాలుగా ఉండేవని, ఖైదీలు తీవ్రమైన శారీరక, మానసిక కష్టాలను అనుభవించేవారని తెలిపారు. అలాంటి కఠినమైన జైలు విధానాలు స్వాతంత్ర్యం అనంతరం కూడా కొనసాగినట్లు గుర్తు చేశారు. కాలక్రమేణా జైలు వ్యవస్థలు శిక్షా కేంద్రాల నుంచి సంస్కరణ, పునరావాసం, మానవీయత, గౌరవం కలిగిన మార్పు కేంద్రాలుగా రూపాంతరం చెందాయన్నారు. ఆ పరిణామ క్రమాన్ని తెలంగాణ జైలు మ్యూజియం అద్భుతంగా ప్రతిబింబిస్తోందని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసి అమలు చేసిన తెలంగాణ కారాగార శాఖను గవర్నర్ అభినందించారు. ముఖ్యంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డాక్టర్ సౌమ్యామిశ్రా, ఆమె బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. మ్యూజియం చారిత్రక వస్తువుల సమాహారం మాత్రమే కాక న్యాయం, శిక్ష, సంస్కరణ మానవీయ మార్పునకు చరిత్రగా నిలుస్తుందని తెలిపారు. పెయింటింగ్ గ్యాలరీలు, పాత బ్యారక్‌ల నమూనాలు, గొలుసులు, సంకెళ్లు, ఉరికంబాలు, అరుదైన జైలు వస్తువులు, ఆడియోవిజువల్ ప్రదర్శనల ద్వారా పూర్వకాల జైలు జీవితం, ఆధునిక సంస్కరణాత్మక జైలు వ్యవస్థల పరిణామాన్ని ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు జైలు జీవితం, క్రమశిక్షణ, ఖైదీల పరిస్థితులు, కారాగార పరిపాలనపై అవగాహన పెరుగుతుందన్నారు. ఇది చట్టాల పట్ల గౌరవం, బాధ్యత, మానవీయత, సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ కారాగార శాఖ ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, జైలు పరిశ్రమలు, వ్యవసాయం, పునరావాస కార్యక్రమాలు, సమాజంలో పునఃకలయిక వంటి రంగాల్లో చేపడుతున్న సంస్కరణాత్మక చర్యలను గవర్నర్ అభినందించారు. డాక్టర్ సౌమ్యామిశ్రా మాట్లాడుతూ జైలు మ్యూజియం అవగాహన, విద్య, పరిశోధన, చారిత్రక అధ్యయనం కోసం సమగ్ర కేంద్రంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి జైలు మ్యూజియం పాత భవనాలు దెబ్బతినడంతో దాన్ని మూసివేశారని, అనంతరం ఆధునిక రూపంలో చంచల్‌గూడలో ఈ మ్యూజియాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రాచీన శిక్షా విధానాల నుంచి ఆధునిక సంస్కరణాత్మక కారాగార వ్యవస్థల వరకు జరిగిన పరిణామాన్ని వివిధ గ్యాలరీలు, పాత జైలు నమూనాలు, చారిత్రక వస్తువులు, శిక్షా విధానాల ప్రదర్శనలు, పునరావాస కార్యక్రమాల ద్వారా మ్యూజియం చూపిస్తోందని ఆమె వివరించారు. నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణ సమయంలో (19611968) ఖైదీలు ఓపెన్ ఎయిర్ జైల్లో ఉండి దేశ నిర్మాణంలో చేసిన సేవలను మ్యూజియంలోని ప్రత్యేక విభాగం ప్రదర్శిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు 24 గంటలు/12 గంటల చెల్లింపు ఆధారిత జైలు అనుభవం కల్పిస్తున్నామని, ఇందులో జైలు వసతి, జైలు భోజనం, క్రమశిక్షణ, రోజువారీ కార్యకలాపాలు, నియంత్రిత జైలు జీవన విధానం ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమం వినోదం కోసం కాక అవగాహన, సహానుభూతి, బాధ్యత, మానవీయ విలువలు, కారాగార సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఈ మ్యూజియం, అనుబంధ కార్యక్రమాలు ప్రజా అవగాహన, జైలు సంస్కరణలు, పునరావాస కార్యక్రమాలకు జాతీయస్థాయిలో ఆదర్శంగా నిలవడమేకాక పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాలు, ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధికి కూడా దోహదపడతాయని డీజీ తెలిపారు. ప్రజల సందర్శన కోసం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్స్‌కు వెబ్‌సైట్ www.telanganajailexperience.comను ప్రారంభించినట్లు, వివరాలు, బుకింగ్స్ కోసం ఈమెయిల్: telanganafeelthejail@gmail.com, ఫోన్: 91 94946 32046ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐజీ ప్రిజన్స్ ఎన్.మురళీబాబు, డీఐజీ ప్రిజన్స్ డాక్టర్ డి.శ్రీనివాస్, హైదరాబాద్ రేంజ్ ఎం.సంపత్, డీఐజీ ప్రిజన్స్ వరంగల్ రేంజ్ ఎన్.శివకుమార్ గౌడ్, సూపరింటెండెంట్ సెంట్రల్ ప్రిజన్ చంచల్‌గూడ డి.భరత్, సూపరింటెండెంట్ పీఏసీ చర్లపల్లి జి.ప్రమోద్, సూపరింటెండెంట్ సెంట్రల్ జైలు చర్లపల్లి టి.లక్ష్మీశ్రీనాథ్, సూపరింటెండెంట్ స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్ హైదరాబాద్ ఎస్.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ సికా(ఎస్ఐసీఏ) తదితర అధికారులు, సిబ్బంది, ఆహ్వానితులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

**జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఎ.చిట్టిబాబు ముదిరాజ్**



**జోగిపేట, మే 12, (సిరి న్యూస్):**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయాణీకుల, ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ అన్నారు. జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో తెలంగాణ ముదిరాజ్ సామాజిక చైతన్య సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు నాదులాపూర్ నారాయణ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఈ బస్టాండ్‌కు వందకుపైగా గ్రామాల నుంచి నుంచి ప్రయాణీకులు వస్తుంటారని అన్నారు. వారు దాహం తీర్చుకోవాలంటే రూ.20 చెల్లించి వాటర్ బాటిల్‌ను కొనుక్కోవాల్సి వస్తుందని అందుకే ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారన్నారు. ప్రజలు, ప్రయాణీకులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బస్టాండ్‌లోని ప్రయాణీకులు, బస్‌లల్లో ఉన్న వారి వద్దకు వెళ్లి త్రాగునీటిని అందజేసారు. రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ఆయనెంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బాయికాడి భూమయ్య, జిల్లా సంఘం నాయకులు చెన్నయ్య, పట్టణానికి చెందిన డాకూరి రఘునా«ద్, చోటూ, అబ్బాస్ అలీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూముల పరిరక్షణకు పోరాటం చేస్తాం

**నల్లవల్లి గ్రామసభలో రైతులు, గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం**



**గుమ్మడిదల, మే 12 (సిరి న్యూస్):**

వ్యవసాయ భూములను పారిశ్రామిక అవసరాల కోసం అప్పగించడం సరైన విధానం కాదని, తమ భూముల జోలికి వస్తే ఏ స్థాయిలోనైనా పోరాటానికి సిద్ధంగా ఉంటామని నల్లవల్లి రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ కొరివిరాణి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని 142, 160 సర్వే నంబర్ల పరిధిలో ఉన్న వ్యవసాయ భూములను పారిశ్రామికవేత్తలకు అప్పగించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తరతరాలుగా సాగుచేస్తున్న భూములే తమ జీవనాధారమని, ఈ భూముల ద్వారా అనేక కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ భూములు కోల్పోతే గ్రామ ప్రజల జీవన విధానం పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని భూముల బదిలీ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు చేపట్టి భూములను కాపాడుకుంటామని హెచ్చరించారు.

# వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



**మెదక్ మే,12(సిరిన్యూస్)**



మెదక్ పట్టణంలోని గోసముద్ర తటాక తీరాన వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశానుగత ధర్మకర్త కాకులవరం మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ఆవుపాలతో అభిషేకం, మహాఅలంకరణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ గావించారు.సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం,లోక కల్యాణార్థం హోమం నిర్వహించి అన్న ప్రసాద వితరణ చేశారు. మెదక్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.అలాగే మెదక్ కోదండ రామాలయం, చమన్ హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడయి.

# పారిశ్రామిక వాడలో హనుమాన్ జయంతి వేడుకలు

- ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో భక్తుల సందడి



**గుమ్మడిదల, మే 12 (సిరి న్యూస్ ):**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడతో పాటు దోమడుగు, బొంతపల్లి, అన్నారం గ్రామాలలో హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొని భక్తులతో హనుమాన్ ఆలయాలు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా హనుమాన్ మందిరాలలో ప్రత్యేక అలంకరణలు చేపట్టి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ విగ్రహానికి చందనం అలంకరించి హారతులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాలలో భజనలు నిర్వహించగా, పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. చిన్నారులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. హనుమాన్ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాలలో భక్తి శోభ వెల్లివిరిసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యారెడ్డి, వార్డు కౌన్సిలర్లు చక్రపాణి, రాజిరెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, జైపాల్ రెడ్డి, కిషన్, కుమార్ గౌడ్, సప్పటి పద్మ, కో ఆప్షన్ సభ్యులు విజయ్ భాస్కర్ రెడ్డి, యువ నాయకులు పొన్నాల శ్రీనివాసరెడ్డి, హుస్సేన్, తుపాకుల రాజు, సత్యనారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు

# అసైన్డ్ భూముల బదిలీని వ్యతిరేకిస్తూ నల్లవల్లి గ్రామస్తుల ఆందోళన

- రైతులకు అన్యాయం జరగనివ్వమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హామీ



**గుమ్మడిదల, మే 12 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో 142, 160 సర్వే నంబర్లలో ఉన్న 337 ఎకరాల అసైన్డ్ ప్రభుత్వ భూమిని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ(టీజీఐఐసీ)కి బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అఖిలపక్ష నాయకులు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని ఈ వ్యవసాయ భూముల్లో రైతులు అనేక రకాల పంటలు సాగు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. తరతరాలుగా సాగుచేస్తున్న భూములను పారిశ్రామిక అవసరాల పేరుతో బదిలీ చేయడం రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. రైతుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లో కూడా రైతులకు అన్యాయం జరగకుండా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే రైతులు కూడా చట్టబద్ధంగా తమ వంతు పోరాటం కొనసాగించాలని సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ రైతులు, అఖిలపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వం లేని వ్యక్తివి కాంగ్రెస్ అంటే ఖబర్దార్...

- అభివృద్ధిని అడ్డుకుంటే ద్రోహిగా నిలబెడతాం
- కమిషన్లకే కక్కృతితో గ్రామాన్ని గాలికి వదిలేసావు
- మల్కాపూర్ లో కాంగ్రెస్ నాయకుల ప్రెస్ మీట్

**కొండాపూర్, మే 12(సిరిన్యూస్):**



పార్టీ సభ్యత్వమే లేనోనివి కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పి అర్థ రహితంగా మాట్లాడితే ఖబర్దార్ అంటూ సంగారెడ్డి కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం మల్కాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివపేట, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు సిద్దన్న, ప్రశాంత్ గౌడ్, మల్లారెడ్డిలు మాట్లాడారు. తొగర్ పల్లి లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడానికి లేనిపోని అక్రమాలు అంటూ కాంగ్రెస్ నాయకుల, అధికారులపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న శ్రీధర్ రెడ్డి పై వారు విరుచుపడ్డారు. ముగ్గురు ముఖ్యమంత్రులతో పరిచయాలు ఉంటే గ్రామ నిరుద్యోగ యువతకు ఉపాధి దారి చూపాలన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో దాదాపు 500 మంది వరకు ఉద్యోగ ఉపాధి చూపించే అవకాశాన్ని అడ్డు తగలడం సిగ్గుచేటు అన్నారు. పరిశ్రమ యజమాన్యం కమిషన్ ఇవ్వాలని అడుగగా ఇవ్వనందుకు సిబ్బందిని బూతు పురాణం మాటలతో దౌర్జన్యానికి పాల్పడ్డ శ్రీధర్ రెడ్డి వీడియో,ఆడియోలు త్వరలో బయట పెడతామని వెల్లడించారు. హయంలో పైసా పని చేయకుండా గ్రామా నిర్వియంగా గాలికి వదిలేసిన చరిత్ర నీకు లేదా ప్రశ్నించారు. దొంగతనాలు,దోపిడీలు,అక్రమ కబ్జాలు చేసిన నీవు కాంగ్రెస్ నాయకులను ఆశ్రయించి తప్పించుకున్నది మర్చిపోయావు అని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకుల పై మరోసారి దుష్ప్రచారం చేస్తే కార్యకర్తలు సహనం కోల్పోయి సైన్యంగా తిరగబడితే ఉప్పెనలో పడి కొట్టుకపోతావ్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. ఈ సమావేశంలో గొల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ వేగవంతంగా చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ మే,12(సిరిన్యూస్)**





ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, ట్రాన్స్పోర్ట్ , పోలీస్ , గ్రామీణాభివృద్ధి, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు,ఇతర శాఖల అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు.మండలాల వారీగా ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలా కొనసాగుతుందో అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులలో ఎంతమంది హమాలిలు ఉన్నారని , ఎన్ని లారీలు ఉన్నాయని తాసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగంగా జరగాలని, అన్లోడింగ్ ప్రక్రియలో హమాలీల సంఖ్య పెంచుకోవాలని, లారీల సంఖ్యను పెంచాలని, లారీలు అందుబాటులో లేకుంటే డీసీఎంలు, ట్రాక్టర్లను కూడా అనుమతించాలని , అధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని,అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడడానికి టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలనీ అధికారులను ఆదేశించారు.మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి లారీలను అందుబాటులో ఉంచలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్,ఆర్డీఓ రమాదేవి జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పాలీసెట్ కు సర్వం సిద్ధం

- జిల్లాలో 6 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 2,068 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

**సంగారెడ్డి, మే 12 (సిరి న్యూస్):**



రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలలో ఇంజనీరింగ్, వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలీసెట్–2026 పరీక్షకు సంగారెడ్డి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ పి. జానకి దేవి తెలిపారు. నేడు బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, సంగారెడ్డి పట్టణం మరియు జోగిపేట్‌లోని 6 కేంద్రాల్లో మొత్తం 2,068 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 9:30 గంటలకే చేరుకోవాలని, 10 గంటల నుంచి లోనికి అనుమతిస్తారని, అయితే ఉదయం 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఆమె స్పష్టం చేశారు. అభ్యర్థులు తమతో పాటు ఇటీవల డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్, హెచ్‌బీ పెన్సిల్, బాల్ పాయింట్ పెన్, ఎరేజర్, షార్పనర్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, సెయింట్ ఆంథోనీ హై స్కూల్, గర్ల్స్ జూనియర్ కళాశాల, ఎస్.వి. జూనియర్ కాలేజ్, బాయ్స్ హై స్కూల్ మరియు జోగిపేట్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను పకడ్బందీగా సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

# దేశాభివృద్ధికి జనగణనే పునాది

- సమాచారం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత..
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- మారథాన్ వాక్ ప్రారంభించిన కలెక్టర్

**సంగారెడ్డి, మే 12 (సిరి న్యూస్):**

జనగణన అనేది కేవలం అంకెల సేకరణ మాత్రమే కాదని, అది దేశ భవిష్యత్తుకు, అభివృద్ధికి బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుండి ఐబీ వరకు నిర్వహించిన జనగణన అవగాహన మారథాన్ వాక్ ను ఆయన జెండా ఊపి ప్రారంభించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మే 10వ తేదీ వరకు స్వీయ గణన ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని, మే 11 నుండి ఎన్యూమరేటర్ల ద్వారా ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ప్రత్యేక గుర్తింపు కార్డులు కలిగిన సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు, వారికి కుటుంబ సభ్యులందరి సామాజిక, ఆర్థిక వివరాలను స్పష్టంగా అందించాలని, ప్రజలు ఇచ్చే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ గణాంకాల ఆధారంగానే ప్రభుత్వం భవిష్యత్తులో సంక్షేమ పథకాలను రూపొందిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరాలంటే ఖచ్చితమైన వివరాలు అందజేయడం పౌరుల కనీస బాధ్యతని



గుర్తు చేస్తూ దేశ పురోభివృద్ధిలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, ఆశా వర్కర్లు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు







- స్థానిక హమాలీలను వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలి
- ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి
- జిల్లా కలెక్టర్లు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.

**మెదక్మే,12(సిరిన్యూస్)**

ధాన్యం,మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు.మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరరావు,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,వాకిటి శ్రీహరి, దానసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మెదక్ ఐడీఓసీ నుండి పాల్గొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడుతూ..మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసు సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటం వల్ల కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజూ నివేదికలు పంపించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు సాధారణ విధానాన్ని విడిచి మిషన్ మోడ్‌లో పని చేయాలని, కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలను జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్న పరిస్థితి రావద్దని, రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్,డి ఆర్ ఓ అంబాదాస్ రాజేశ్వర్,ఆర్డీఓ రమాదేవి జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ లో ప్రోటోకాల్ వివాదం ఎమ్మెల్యే ఆగ్రహం






- వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్
- లారీల కొరతతో రైతుల ఇబ్బందులు
- " ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తే ఆక్షేపణ అవసరమా అంటూ ప్రశ్నించిన సునీత లక్ష్మారెడ్డి

**కొల్చారం మే 12 (సిరి న్యూస్)**

నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రోటోకాల్ పాటించడం లేదని సునీత లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు కొల్చారం మండలం పోతం శెట్టిపల్లి చౌరస్తా రైతు వేదిక వద్ద మంగళవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తం చేశారు. అధికార కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను సమాచారం ఇవ్వకుండా నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని ఆమె అన్నారు.రైతులు కోతకు తెచ్చిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వ అధికారులను కోరారు.ధాన్యం రవాణాకు అవసరమైన లారీల కొరత కూడా తీవ్ర సమస్యగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం నిల్వలు పెరుగుతున్నాయని చెప్పారు. రైతులు ఇబ్బంది పడకుండా వెంటనే అదనపు వాహనాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాల విషయంలో కూడా ఎమ్మెల్యే స్పందించారు. "ప్రజల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు ఎమ్మెల్యే ప్రారంభిస్తే నేరమా?" అంటూ ప్రశ్నించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను రాజకీయ కోణంలో చూడకూడదని ఆమె వ్యాఖ్యానించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు, పేదలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో మండల యువత అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ మాజీ జెడ్పిటిసి సభ్యులు మేఘమాల సంతోష్ కుమార్ మాజీ సి డి సి చైర్మన్ నరేందర్ రెడ్డి గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్ కొల్చారం గ్రామ మాజీ సర్పంచ్ ఉమా రాజా గౌడ్ మాజీ సర్పంచ్ చిట్యాల యాదయ్య మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు తుక్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు సర్పంచ్ రమేష్ తుక్కాపూర్ రవి రాంపూర్ పోచయ్య



# నల్లవల్లి రైతుల భూములను గెజిట్ నుంచి తొలగించాలి

**జిల్లా కలెక్టర్ కు ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి రైతుల వినతి**




**గుమ్మడిదల, మే 12 (సిరి న్యూస్):**

తాము సాగుచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వ్యవసాయ భూములను తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ)కు కేటాయించవద్దని కోరుతూ నల్లవల్లి గ్రామ రైతులు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి రైతులు కలెక్టర్ కు తమ ఆవేదనను వివరించారు. గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో సర్వే నంబర్ 142లో గల 126.09 ఎకరాలు, సర్వే నంబర్ 160లో గల 211.28 ఎకరాలు, మొత్తం 337.37 ఎకరాల వ్యవసాయ భూమిని టీజీఐఐసీ స్థాపన కోసం భూసేకరణలో భాగంగా ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గెజిట్ పరిధి నుంచి తమ గ్రామానికి చెందిన సాగులో ఉన్న వ్యవసాయ భూములను తొలగించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయమే తమ ప్రధాన జీవనాధారమని, సంవత్సరమంతా కూరగాయలు, పంటలు సాగు చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించడంతో పాటు పిల్లలను చదివిస్తున్నామని రైతులు కలెక్టర్‌కు వివరించారు. భూములు కోల్పోతే తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రైతుల సమస్యపై సానుకూలంగా స్పందించినట్లు అఖిలపక్ష నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. సంబంధిత భూముల అంశంపై మరోసారి విచారణ నిర్వహిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి..

- బాధిత బాలికకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్.
- కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్





**మెదక్ ప్రతినిధి, మే12(సిరి న్యూస్)**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బిఆర్ఎస్ పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు డిమాండ్ చేశారు.మంగళవారం మెదక్ పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కేసు దర్యాప్తులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు.చట్టం అధికార పార్టీకోలా, సామాన్య ప్రజలకోలా వేర్వేరుగా అమలవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బిఆర్ఎస్ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేసే పోలీసులు, ఈ ఘటనలో మాత్రం స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు.దేశంలో మహిళల రక్షణ, బాలికల భద్రత గురించి పెద్ద ఎత్తున మాట్లాడే నాయకుల కుటుంబ సభ్యులే ఇలాంటి ఆరోపణలు ఎదుర్కోవడం దురదృష్టకరమని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనన్నారు.సామన్యుడైనా కేంద్ర మంత్రిపుత్రుడైనా ఒకే విధమైన న్యాయం జరగాలని స్పష్టం చేశారు.కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని కాపాడేందుకు రాజకీయ ప్రభావం ఉపయోగించకూడదని హెచ్చరించారు. బండి సంజయ్ కుమార్ తన కుమారుడిని రక్షించేందుకు అధికార ప్రభావాన్ని వినియోగిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసు దర్యాప్తును బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో పట్టణ పార్టీ కో కన్వీనర్లు గడ్డమీద కృష్ణగౌడ్, లింగారెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్ దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్ ఆర్కే. శ్రీనివాస్, నాయకులు ప్రభు రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై అధికారులు మౌనం

- గ్రామాల్లో సర్పంచ్లను సైతం లెక్క చేయని వైనం
- అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న ఇంచార్జి కార్యదర్శులు
- అధికారుల మౌనంపై అంతర్యం ఏమిటి




**హత్నూర,(సిరి న్యూస్):** క్షేత్రస్థాయిలో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పనిచేసే గ్రామ పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం రోజురోజుకు పెరిగి పోతుంది. కొన్ని గ్రామాల్లో సైతం నూతనంగా ఎన్నికైన సర్పంచులను సైతం పట్టించుకోక పోవడం గమన్నారం. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో మొత్తం 38 గ్రామపం చాయతీలు ఉండగా, 80 శాతం గ్రామపం చాయతీ కార్యదర్శిలు దూరప్రాంతాల్లోని పట్టణాల్లో ఉంటూ అటు గ్రామ ప్రజల సమస్యలు ఇటు పారిశుధ్య కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం మండల కేంద్రమైన హత్నూర గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు మంచినీటి ట్యాంకు వద్ద ఏర్పడ్డ పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తు పనులు చేపడుతుండగా అదే సమయంలో ఒక్కసారిగా కార్మికులపై తేనెటీగలు దాడి చేశాయి. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ చెక్క మానస రవీందర్ గౌడ్, వార్డు సభ్యులు గ్రామస్తులతో పాటు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డాక్టర్లను కోరారు. నిరంతరం గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులకు ఎలాంటి భద్రత సామాగ్రి కల్పించకుండా వారితో పనులు చేపట్టడం జరుగుతుందని ఇంచార్జి కార్యదర్శిపై స్థానికులు మండిపడ్డారు. దౌల్తాబాద్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పోస్టింగ్ ఉన్న మజార్ అలీ గత కొన్ని నెలల పాటు గ్రామ పంచాయితీ నిధుల విషయంలో బలమైన ఆరోపణలు ఎదుర్కొని ఇప్పుడు మాత్రం ఇంచార్జి కార్యదర్శిగా హత్నూర గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు. హత్నూర గ్రామపంచాయతీ పెద్ద గ్రామం అయినప్పటికీ ఇంచార్జి కార్యదర్శి మాత్రం స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దౌల్తాబాద్ పోస్టింగ్ ఉన్న మజార్ అలీ స్థానంలో నస్తీపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిని ఇంచార్జిగా కేటాయించడంలో సంబంధిత అధికారులు మాత్రం అతనిపై ఉత్సాహం చూపించడంలో అంతర్యం ఏమిటి. అతని విషయంలో అధికారుల మౌనం ఎందుకు వహిస్తున్నారన్న విషయంపై పలు అనుమానాలకు తావిస్తుంది. మండలంలోని పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని, ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్య దర్శులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పత్రిక ప్రతినిధులు హత్నూర ఎంపీఓ యూసుఫ్ ను ఫోన్ చేసి వివరణ కోరగా, హత్నూర గ్రామ ఇంచార్జి కార్యదర్శి మజార్ అలీ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఆరోపణలు తమ దృష్టికి వచ్చిన విషయం వాస్తవమేనని, దౌల్తాబాద్ గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో మజార్ అలీపై ఆరోపణలు రావడంతోనే హత్నూర గ్రామపంచాయతీ ఇంచార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతని స్థానంలో నస్తీపూర్ కార్యదర్శిని ఇంచార్జిగా ఇవ్వడం జరిగిందని వివరించారు.




# ఓటమి విజయానికి తొలిమెట్టు

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ఆదిలాబాద్,(సిరి న్యూస్):** ఓటమి అనేది విజయానికి తొలిమెట్టు అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నం.1 పాఠశాలలో మంగళవారం పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న అభ్యాసన మెరుగుదల తరగతులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల్లో ఫెయిల్ అయినందుకు ఎవరూ నిరాశ చెందవద్దని ధైర్యం చెప్పారు. పరీక్ష అనేది నిరంతర ప్రక్రియ అని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. తాను కూడా మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్లో విజయం సాధించలేదని తెలిపారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుని, పట్టుదలతో చదివి ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్ సాధించానని, అనంతరం ఐఏఎస్ లక్ష్యాన్ని చేరుకున్నానని వివరించారు. విద్యార్థులు ఎందుకు ఫెయిల్ అయ్యామో ఆలోచించి, లోపాలను సరిదిద్దుకుని కష్టపడితే తప్పకుండా విజయం సాధిస్తారని భరోసా ఇచ్చారు. ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని, ఏదైనా అంశం అర్థం కాకపోతే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అవసరమైతే తరగతుల సమయాన్ని పెంచే అంశాన్ని కూడా పరిశీలిస్తామని అన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ క్లాసులు, స్నాక్స్ వంటి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సానుకూల దృక్పథంతో సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నీలాదేవి, ఎంఈఓ సోమయ్య, డీసీఈబీ సెక్రటరీ గజేందర్, ఏఎంఓలు లక్ష్మణ్, అజయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలి

- అవసరమైతే ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి
- హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్





**సిరిసిల్ల,(సిరి న్యూస్):** ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృ ష్ణారావు తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచే యాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదు పాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు, రవాణా శాఖ అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొని అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసు సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్నిచోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు కోతలు విధిస్తున్నారని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని హెచ్చరించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగిం చాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమ ర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజు నివేదికలు పంపాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి వచ్చే ప్రతికూల వార్తలపై రిజాయిండర్లు క్రమం తప్పకుండా మీడియాకు పంపించాలని సూచించారు. ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయిం చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11లక్షల 52వేల టన్నుల ధాన్యం పెండింగ్లో ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ.3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ యాసంగి సీజన్లో భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహిం చాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల సూచనలపై ఎప్పటి కప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రా మకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతు న్నాయని తెలిపారు. రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాసంగి సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా 16లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగి, ఎకరానికి సగటున 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రాష్ట్ర మంత్రివర్గం రూ.4,178 కోట్లను ఆమోదిం చిందని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా 8లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరగగా, ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ప్రైవేట్ వ్యాపారులు కూడా అధిక ధరలకు మరో 6లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 14లక్షల 90వేల మెట్రిక్ టన్నుల నిల్వ అవసరం ఉండగా, ఇప్పటికే 10లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు వివరించారు. అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉంచామని, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా సరఫరాలో కొంత అంతరాయం ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు స్వయంగా గన్నీ సంచులు తీసుకువస్తే డీబీటీ ద్వారా చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు. హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ.8.50కు పెంచినట్లు తెలిపారు. అవసరమైన రవాణా వాహనాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, మెప్మా ఏఓ మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**భీంపూర్,(సిరి న్యూస్):** గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం భీంపూర్ మండలం గోన గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని, విప్లవ వీరుడు కొమరంభీం విగ్రహాన్ని ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి బోజారెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడంతో పాటు మెరుగైన సేవలు అందించేందుకు నూతన పంచాయతీ భవనాలు దోహదపడతాయని పేర్కొన్నారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు కొమరంభీం అని కొనియాడారు. ఆయన ఆశయాలు ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, యువత ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తన్వీర్ అహ్మద్ పటేల్, గ్రామ సర్పంచ్ మడావి కమలాబాయి, ఉప సర్పంచ్ ఎండి ముశ్రాన్ అహ్మద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కళాశాలలో ఘనంగా 'రెమెడియల్ ఎడ్యుకేషనల్ డే'



**నేరడిగొండ,(సిరి న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రెండవ రోజు 'రెమెడియల్ ఎడ్యుకేషనల్ డే'కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శభాన తరన్నుమ్ మాట్లాడుతూ రాబోయే సప్లమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో గత పది రోజులుగా ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. అధ్యాపకులచే నిర్వహించబడిన ఈ ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని, ఈ శిక్షణ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని పేర్కొన్నారు. రెమెడియల్ ఎడ్యుకేషనల్ డే ముగింపు సందర్భంగా పరీక్షల పట్ల పాటించాల్సిన సూచనలు, మెళకువలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుభాష్, సురేష్, రేఖ, నాగారావు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంఘ అధ్యక్షుడిగా వేణుగోపాల్ గౌడ్



**గంభీరావుపేట,(సిరి న్యూస్):** గంభీరావుపేట మండలం మోకుదెబ్బ గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా ఎర్రం వేణుగోపాల్ గౌడ్ను మంగళవారం జిల్లా అధ్యక్షుడు లచ్చులగారి శ్రీనివాస్ గౌడ్ అధికారికంగా నియమించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, సభ్యులు ఎర్రం వేణుగోపాల్ గౌడ్కు అభి నందనలు తెలియజేశారు. సంఘ బలోపేతం, గౌడ సామాజికవర్గ అభివృద్ధి, యువతను సంఘ కార్యక లాపాల్లో భాగస్వామ్యం చేయడం వంటి లక్ష్యాలతో ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లచ్చులగారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గంభీరావుపేట మండలంలో సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి సమర్థ నాయకత్వం అవసరమని తెలిపారు. ఆ బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహించగల సామర్థ్యం ఎర్రం వేణుగోపాల్ గౌడ్కు ఉందనే నమ్మకంతో ఈ పదవిని అప్పగించినట్లు పేర్కొన్నారు. నూతన మండల అధ్యక్షుడు ఎర్రం వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు లచ్చులగారి శ్రీనివాస్ గౌడ్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, మండలంలోని గౌడ యువతను సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తానని చెప్పారు. గౌడ సంఘ ఐక్యతే తమ బలమని, అందరి సహకారంతో సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, యువకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

**కాగజ్నగర్,(సిరి న్యూస్):** జిల్లా కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి కల్పన శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి బి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల సహకారంతో జాబ్ మేళాలు నిర్వహిస్తూ అర్హులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్మెంట్ సెల్ సహకారంతో మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఏదో ఒక రంగంలో స్థిరపడాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడు తున్నట్లు తెలిపారు. కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఇంచార్జ్ డాక్టర్ డి.లక్ష్మి నరసింహం మాట్లాడుతూ వివిధ కంపెనీలు, జిల్లాలోని నిరుద్యోగ యువత మధ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుసంధానకర్తగా పనిచేస్తూ కెరీర్ గైడెన్స్, జాబ్ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం 30 మంది అభ్యర్థులు హాజరుకాగా, రుద్ర హాస్పిటల్, ఎల్ఐసీ యాజమాన్యాలు వివిధ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపికైన అభ్యర్థులకు త్వరలో సమాచారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి నరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్ధన్, లెక్చరర్లు ఎం.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రజనీ... కమల్ సినిమాలో త్రిష?



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

**ప్రేమ గట్టిగా...**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. ప్రముఖ సింగర్‌కు జైలు శిక్ష

ప్రముఖ పాప్ సింగర్ బ్రిట్నీ స్పియర్స్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నేరాన్ని అంగీకరించారు. దక్షిణ కాలిఫోర్నియాలో మార్చిలో ఆమెపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరగ్గా.. ఆమె నేరాన్ని అంగీకరించారు. దీంతో ఆమెకు (Britney Spears) వెంచురా కౌంటీ సుపీరియర్ కోర్టు ఒకరోజు జైలు శిక్షతో పాటు కొన్ని నిబంధనలు విధించింది. శిక్షతో పాటు ఆమె భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం చేయకుండా ఉండటానికి కోర్టు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల పాటు ప్రభుత్వం నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించింది. ప్రతి వారం థెరపీ సెషన్లకు హాజరుకావాలని, నెలకు రెండుసార్లు తప్పనిసరిగా సైకియాట్రిస్ట్‌ను కలవాలని సూచించింది.






## బట్టకాల్చి మీదేస్తే ఊరుకోం.. రీషూట్ పుకార్లపై మేకర్స్ స్ట్రాంగ్ కౌంటర్!

గత కొద్ది రోజులుగా నాని హీరోగా నటిస్తున్న ‘ది పారడైజ్’ సినిమా గురించి సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు వస్తూనే ఉన్నాయి. సినిమా అవుట్‌పుట్ అనుకున్న విధంగా రాలేదని, అందుకే చాలా వరకు ఇష్యూస్ చేస్తున్నారని వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే, తాజాగా ఇలాంటి వార్తల మీద సినిమా యూనిట్ అధికారికంగా స్పందించింది. ఇలాంటి తప్పడు వార్తలు ప్రచారం చేసే వారికి సీరియస్ వార్నింగ్ ఇస్తూ, అసలు వాస్తవాలను టీం బయటపెట్టింది.

“మా సినిమాను మొదటి రోజు ఎంత స్పష్టతతో ప్లాన్ చేశామో, ఇప్పుడు కూడా అంగుళం కూడా తేడా లేకుండా అదే పక్కా ప్రణాళికతో షూటింగ్ చేస్తున్నాం. ఇప్పటికే వంద రోజుల పాటు షూటింగ్ ఎంతో విజయవంతంగా పూర్తయింది. బ్యాలెన్స్ ఉన్న షెడ్యూల్ కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా, ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం జరుగుతోంది. ఇప్పటివరకు ఈ సినిమా కోసం ఏ ఒక్క సీన్ కూడా రీషూట్ చేయలేదు, భవిష్యత్తులో కూడా చేసే ప్రసక్తి లేదు. సోషల్ మీడియాలో వచ్చే ఎలాంటి నిరాధారమైన వార్తలను దయచేసి నమ్మకండి,” అని మేకర్స్ పేర్కొన్నారు.

## తమిళనాడు కోడలిగా శ్రీలీల..?



చాలా తక్కువ సమయంలోనే టాలీవుడ్ అగ్ర హీరోలందరి సరసన నటించి స్టార్‌డమ్ తెచ్చుకున్న శ్రీలీల, ప్రస్తుతం కోలీవుడ్ బాలీవుడ్ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తాజాగా చెన్నైలోని అమృత ఏవియేషన్ కాలేజ్ ఈవెంట్‌లో బ్రాండ్ అంబాసిడర్‌గా పాల్గొన్న ఆమె, విద్యార్థులతో ముచ్చటిస్తూ తన వ్యక్తిగత, సినీ జీవితం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

ఈ ఈవెంట్‌లో విద్యార్థులు శ్రీలీలను ఉద్దేశించి ‘లేడీ సూపర్ స్టార్’ అని నినాదాలు చేయగా, ఆమె సున్నితంగా ఆ ట్యాగ్‌ను తిరస్కరించారు.. ‘నాకు ఇష్టమైన నటి నయనతార. ఆమె మాత్రమే అసలైన లేడీ సూపర్ స్టార్. ఆమె నాకు రోల్ మోడల్. ఆ స్థాయికి చేరుకోవడానికి నాకు ఇంకా చాలా సమయం పడుతుంది’ అని తన వినయాన్ని చాటుకున్నారు. అలాగే, ఓటమికి భయపడకుండా ప్రయత్నిస్తూనే ఉండాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇదే వేదికపై తన పెళ్లి గురించి శ్రీలీల చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.. ‘చెన్నై కుర్రాళ్లు చాలా స్వీట్. ఇక్కడి దోశ అంటే నాకు చాలా ఇష్టం. నయనతార గారి లాగే నేను కూడా చెన్నైలోనే పెళ్లి చేసుకుంటానా అనేది ఇప్పుడే చెప్పలేను’ అని ఆమె నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఈ మాటలతో శ్రీలీల తమిళనాడు కోడలిగా వెళ్లనున్నారా? లేదా అప్పుడే ఎవరితోనైనా ప్రేమలో పడ్డారా? అంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ధనుష్ సరసన నటిస్తున్న శ్రీలీల, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ మూవీతో పలకరించనున్నారు.

## “హగ్గులు లేకపోతే నిద్ర పట్టదు”..



టాలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్‌పై గళమెత్తిన అతికొద్ది మంది నటీమణుల్లో గాయత్రీ గుప్తా ఒకరు. ఎప్పుడూ బోల్డ్ అండ్ స్ట్రైట్ ఫార్వర్డ్ వ్యాఖ్యలు చేసే ఆమె, తాజాగా ఒక ఇంటర్వ్యూలో “ఫిజికల్ టచ్” .. మానవ సంబంధాల ప్రాముఖ్యత గురించి సైంటిఫిక్ కోణంలో మాట్లాడారు.

మనిషి జీవితంలో శారీరక స్పర్శ (Physical Touch) కేవలం కామం కోసం మాత్రమే కాదని, అది మానసిక ప్రశాంతతకు, భద్రతా భావానికి సంకేతమని గాయత్రీ పేర్కొన్నారు. “ఒక మనిషి తాను సురక్షితంగా ఉన్నానని భావించాలంటే రోజుకు కనీసం 8 నుంచి 12 హగ్గులు అవసరం. అలా జరిగినప్పుడే రాత్రిపూట ప్రశాంతంగా నిద్ర పడుతుంది” అని ఆమె చెప్పారు. ఈ హగ్గులు కుటుంబ సభ్యులైన అమ్మ, నాన్న, సోదర సోదరీమణుల నుంచి పొందే ఆత్మీయ ఆలింగనం కావాలని ఆమె స్పష్టం చేశారు. అంతే కాదు కేవలం హగ్ చేసుకోవడమే కాకుండా, కనీసం 20 సెకన్ల పాటు ఆ టచ్ ఉండాలని గాయత్రీ సూచించారు.

అలా చేసినప్పుడు మన శరీరంలోని హార్మోన్లు సమతుల్యంగా ఉండి, మనసు రిలాక్స్ అవుతుందని, ఈ ప్రపంచంలో మనం సేఫ్‌గా ఉన్నామనే ఫీలింగ్ కలుగుతుందని ఆమె వివరించారు. భద్రత ఆప్యాయతను ఇచ్చే ఏ స్పర్శ అయినా మనిషిని మానసికంగా దృఢంగా మారుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి. చాలా మంది నెటిజన్లు ఆమె చెప్పిన దానిలో వాస్తవం ఉందని, ఒత్తిడితో కూడిన నేటి జీవితంలో ఆత్మీయ అనురాగాలు చాలా అవసరమని కామెంట్స్ చేస్తున్నారు.

## అభిమానుల నిరీక్షణకు తెర.. ‘పెద్ది’ ట్రైలర్ విడుదలకు డేట్ ఫిక్స్ చేసిన మూవీ మేకర్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘పెద్ది’ (Peddi). ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 4న థియేటర్లలోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. అయితే రామ్ చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్ అప్‌డేట్‌ను మూవీ టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా ట్రైలర్‌ను మే 18న విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు.

అంతేకాకుండా ఒక ఆసక్తికరమైన పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రామ్ చరణ్ లుక్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ఆయన తన వెనుక ఒక మంచాన్ని తగిలించుకుని, ఒక చేతితో ట్రంక్ పెట్టెను, మరో చేతితో VIP అని రాసి ఉన్న కవర్‌ను పట్టుకుని రైల్వే ట్రాక్‌ను దాటుతూ కనిపిస్తున్నారు. ఈ రా అండ్ రస్టిక్ లుక్ సినిమాపై ఉన్న క్యూరియాసిటీని ఒక్కసారిగా పెంచేసింది. కాగా.. ఈ చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు జగపతి బాబు, దివ్యేందు శర్మ, సాయి కుమార్, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం.. ప్రమోషన్ల విషయంలోనూ తగ్గేదే లే అన్నట్లుగా దూసుకుపోతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న మెగా అభిమానులు సోషల్ మీడియాలో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పోస్టర్‌ను వైరల్ చేస్తున్నారు. మే 18న రాబోతున్న ట్రైలర్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.





## జులై నుంచి సెట్ పైకి.. అనిల్ రావిపూడి మల్టీస్టారర్ చిత్రం షూటింగ్ అప్డేట్

వరుస బ్లాక్ బస్టర్ హిట్స్‌తో ఇండస్ట్రీలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్నాడు అనిల్ రావిపూడి. దీంతో ఆయన నుంచి వచ్చే సినిమాల కోసం సినీ లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఇయర్ మెగాస్టార్ చిరంజీవి మన శంకర వర ప్రసాద్ గారు చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈయన ఇప్పుడు.. మల్టీస్టారర్ చిత్రాన్ని అనౌన్స్‌చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైన్మెంట్‌ను సిద్ధం చేస్తున్నాడు. ఇప్పటికే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా.. కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ అప్డేట్ వచ్చింది. వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా తెరకెక్కబోతున్న ఈ సినిమా షూటింగ్ జులై నుంచి మొదలు కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంది. ఇక ఈ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ విషయంలో కూడా వార్తలు రాగా.. జీవీ ప్రకాష్ కుమార్ ఫైనల్ అయ్యారు. నవంబర్, లేదా డిసెంబర్ కల్లా టోటల్ షూట్ కంప్లీట్ చేసి 2027 సంక్రాంతికి విడుదల చేయనున్నారు’ అని ఓ పోస్ట్ వైరల్‌గా మారింది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.